ప్రజాశక్తి

గురువారం 20 జూన్ 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



సమన్వయంతో పని చేద్దాం

అధికారుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, ఇకపై ప్రజలకు సేవలు అందించడంలో సమన్వయంతో పని చేసి అభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి కుళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి వనరుల కల్పనకు, తాగునీటి చెరువుల ఏర్పాటుకు డిపిఆర్ తయారీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలం వచ్చినా ఇంతవరకు సాగునీటి కాలువల నిర్వహణ పనులు చేపట్టకపోవడం పట్ల ఇరిగేషన్ అధికారులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా రైతులకు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయాలన్నారు. రు.5,156 కోట్లతో నాలుగు బెర్తలతో 13 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యంతో 2025 అక్టోబర్ నాటికి మొదటి దశ పూర్తి చేసే లక్ష్యంతో బందర్ పోర్టు పనులు చేపట్టామని, ఇప్పటివరకు 709 కోట్లు వ్యయం చేశామని అధికారులు తెలిపారు. మచిలీపట్నం మున్సిపల్ (మిగతా 2లో)

నిర్వాసితులకు పరిహారం

- విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం భరోసా
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రీన్‌సిగ్నల్



ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద కేటాయించిన భూమి

ప్రజాశక్తి-గన్నవరం

ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గన్నవరం విమానాశ్రయ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను టిడిపి ప్రభుత్వమే పరిష్కరించాల్సిన పరిస్థితి వచ్చింది. వైసిపి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేసింది. అర్అండ్ఆర్ ప్యాకేజీ కింద స్థలం కేటాయింపుతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.9 లక్షలు ఇస్తామని చెప్పిన మాటలు నీటి మీద రాతలయ్యాయి. నిర్వాసితులకు డబ్బులు ఇవ్వకుండానే కాలం గడిపేసింది. నిర్వాసితులకు పట్టాలు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సరిపెట్టారు. దానికి సంబంధించి కనీసం జీవో కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం దశల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనుంది. గృహ నిర్మాణాలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని నిర్ణయించింది. వెంటనే జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగి నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం, చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి సిఆర్‌డిఎకి విన్నవించారు.

గతంలో నిర్వాసితులతో కలిసి వామపక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. విస్తరణలో దావాజీగూడెం, అల్లాపురం, బుద్దవరంలో ఇళ్లు, స్థలాలు పోతున్న 423 కుటుంబాలకు గృహాలు నిర్మించేందుకు 2015లో టిడిపి ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తీసుకొచ్చింది. ఈ ప్యాకేజీలో భాగంగా గృహ నిర్మాణాలకు చిన్న ఆవుటపల్లి పరిధిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా సుమారు 52 ఎకరాల భూమి సేకరించారు. ఆ భూమిలో కొద్దిమేర మెరక చేసి, మౌలిక సదుపాయల కల్పనను అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి నిర్వాసితులకు ప్లాట్లు కూడా కేటాయించకుండా చేతులు దులుపుకుంది. రెండుసార్లు నిర్వాసితులతో సమావేశాలు నిర్వహించి లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితుల గృహ నిర్మాణాలకు రెండు దఫాలుగా రూ.4.50 లక్షలు చొప్పున ఒక్కొక్కరికీ రూ.9 లక్షలు, సమస్యల పరిష్కారానికి రూ.80.48 కోట్లు ఇస్తామని చెప్పి నిధులు మంజూరు చేయలేదు. ఎయిర్‌పోర్టు అవుట్ డ్రెయిన్ కోసం ఇళ్లు తొలగించిన 47 కుటుంబాలకు అద్దె బకాయిలు రూ.1.21 కోట్లు, ఆర్అండ్ఆర్ స్థలంలో మౌలిక సదుపాయాలకు రూ.41.20 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.38.06 కోట్లు వ్యయం చేస్తామని చెప్పి రిక్తహస్తాలు చూపించారు. ఇంకా గృహ నిర్మాణాలకు రెండో విడత నిధులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ స్థలంలో లెవలింగ్, రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాల కోసం మిగిలిన రూ.63.12 కోట్లు కూడా కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందే కానీ డబ్బులు విడుదల చేయలేదు. విమానాశ్రయ నిర్వాసితుల (మిగతా 2లో)

గందరగోళం !

పిఎం కిసాన్ విడతల వారీ విడుదలలో హెచ్చుతగ్గులు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల గందరగోళంగా మారింది. ఎప్పుడు ఏ రైతుల ఖాతాలో జమవుతుందో..ఎందుకు ఆగిపోతుందో తెలవని పరిస్థితి నెలకొంది. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను కేంద్రం ఎలాగూ గుర్తించడం లేదు. నిబంధనలకు అనుగుణంగా వ్యవసాయ భూమి ఉన్న రైతులకు పథకాన్ని అందించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. 17 విడతలలో కృష్ణాజిల్లాలో ఈ పథకం ద్వారా లబ్ది పొందిన రైతుల సంఖ్యను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతుంది.

ఎరువులపై రాయితీలు తగ్గించడం, డీజిల్‌పై ప్రభుత్వాలు పన్నుల మోత మోగించడంతో ట్రాక్టర్ కిరాయిలు భారీగా పెరిగిపోయాయి. దీంతో వ్యవసాయ పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఎకరం విస్తీర్ణంలో వరి పండించాలన్నా రూ.40 వేలు వ్యయం అవుతోంది. చెరకు, పసుపు, కంద, మిర్చి, అరటి తదితర వాణిజ్య పంటలు పండించాలంటే రూ. లక్షకుపైగా వ్యయం అవుతోంది. ఈ క్రమంలోనే రైతులకు ఒకింత ఉపశమనం కల్గించడానికి కేంద్రం (మిగతా 2లో)

విడత	లబ్ధి పొందిన రైతులు
1	1,88,426
2	1,83,117
3	1,77,910
4	1,71,972
5	1,69,011
6	1,66,440
7	1,59,891
8	1,48,981
9	1,43,740
10	1,37,713
11	1,34,458
12	1,14,808
13	1,07,070
14	84,963
15	74,740
16	66,219
17	1,11,808

స్టాక్ పాయింట్లలో అవకతవకలపై చర్యలు

- మంత్రి నాదెండ్ల మనోహర్



గొల్లపూడిలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి-భవానీపురం: స్టాక్ పాయింట్లలో అవకతవకలపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్లో పౌర సరఫరాల శాఖకు చెందిన స్టాక్ పాయింట్లను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. సరకుల తూకాన్ని పరిశీలించి బరువు తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించారు. కనీసం స్టాక్‌ను నమోదు (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

నిర్వాసితులకు పరిహారం

అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. దీనికి తోడు వెంచర్లలో స్థలాలు కోల్పోయిన వారికి స్థలం ఎక్కువ బదులు స్థలం ఇస్తామని అద్దంపూడిలో 52 ఎకరాలు సేకరించారు. ఆ సమస్యను గాలికి వదిలేసారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం విమానాశ్రయ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనుంది.

స్థలాల కేటాయింపులో అవినీతి?

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో నిర్వాసితులకు స్థలాల కేటాయింపులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అప్పటి తహశీల్దార్ పని కట్టుకుని ఒక పథకం ప్రకారం ఇళ్లు కోల్పోని వారికి, రాజకీయ పెద్దలకు స్థలాలు అప్పగించి రిజిస్ట్రేషన్లు చేయించారనే వాదన ఉంది. టిడిపి ప్రభుత్వంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు మాత్రమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఒక్కొక్కరికి ఐదు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే రెవెన్యూ అధికారుల అవినీతి కారణంగా ఇళ్ల స్థలాలు పోని వారికి, లేని వారికి కూడా స్థలాలు కేటాయించారు. దీనిపై నిజమైన నిర్వాసితులు పెద్దఎత్తున గొడవ చేశారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించారు. పట్టాల రిజిస్ట్రేషన్ వ్యవహారం కూడా రహస్యంగా నడిపారు. ఈ విషయాలను దావాజీగూడెం, అల్లాపురం గ్రామాలకు చెందిన నిర్వాసితులు బహిరంగంగానే చెబుతున్నారు. అనర్హులకు పట్టాలు ఇచ్చారని గొంతెత్తి అరుస్తున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రంగంలోకి దిగి అవినీతి వ్యవహారాన్ని బట్టబయలు చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

సమన్వయంతో పని చేద్దాం

కార్పొరేషన్ పరిధిలో అమృత్ 2.0 కింద రు.57.33 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో పట్టణంలో తాగునీటి సరఫరా పరిస్థితి మెరుగుపరచడం వంటి పనులు వెంటనే చేపట్టాలన్నారు. అధికారులు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, బందర్ ఆర్డీవో ఎం.వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్లలో అవకతవకలపై చర్యలు

చేయని దుస్థితి నెలకొనడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టాక్ పాయింట్‌లో అవకతవకలు గుర్తించామని చెప్పారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఆరు సరుకుల్లో ఐదు సరుకులు ఫెయిల్ అయినట్లు గుర్తించామన్నారు. మొత్తం 160 స్టాక్ పాయింట్లు పరిశీలించామని, 68 చోట్ల స్టాక్‌ఫెయిల్ అయినట్లు గుర్తించామని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

గందరగోళం!

పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. పెట్టుబడి సాయంగా రైతులకు ఏటా మూడు దఫాలుగా రూ. 6 వేలు జమ చేస్తోంది. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత కృష్ణాజిల్లాలో 1,11,604 మంది రైతుల ఖాతాల్లో 22 కోట్ల 32 లక్షల 08 వేలు జమ చేశారు. ఒక్కో రైతు ఖాతాలో ఎప్పటిలాగే ఈ దఫా రూ. 2 వేలు చొప్పున జమయ్యాయి. మొదటి విడత లబ్ధి పొందిన రైతులతో పోల్చితే రైతుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మొదట విడతలో 1, 88, 426 మందికి లబ్ధి చేకూరింది. వీరితో పోల్చితే 76,822 మంది లబ్ధిదారులు తగ్గిపోయారు. 16 విడతలో కేవలం 66,219 మంది రైతుల ఖాతాల్లో మాత్రమే కేంద్రం సమ్మాన్ నిధిని జమ చేసింది.

అవగాహనతోనే సికిల్ సెల్ నిర్మూలన


- 3 వరకు అవగాహన కార్యక్రమాలు
- గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దష్టి
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

సరైన అవగాహనతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చని, ఈ నెల 19 నుంచి జులై 3 వరకు గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినం సందర్భంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, వైద్యాధికారులతో కలిసి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్-వ్యాధి సమగ్ర సమాచారానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు, మ్యాన్యువల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై 15 రోజుల పాటు పాఠశాలలతో పాటు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయంతో పని చేయాలన్నారు. 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని.. ఇది అంటు వ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న వ్యక్తి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సకాలంలో గుర్తించి సరైన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా రోగి జీవన నాణ్యతను పెంచొచ్చని పేర్కొన్నారు. రాబోవు తరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమని కలెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లోని ముఖ్యాంశాలు, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్ష, సికిల్ సెల్ ఎనీమియా చికిత్స తదితర అంశాలపై డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని వివరించారు. అదే విధంగా గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళిక, క్షేత్రస్థాయి అధికారుల సమన్వయం తదితర అంశాలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డీఐవో డాక్టర్ అబ్బృత, డీఎంవో డా. మోతీబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. జె.సుమన్, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డాక్టర్ మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రెవెన్యూ ఉద్యోగుల అభినందనలు



ప్రజాశక్తి-విజయవాడ: సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్.ఢిల్లీరావును బుధవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఓటర్ల జాబితా రూపకల్పన నుండి ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర ప్రక్రియలను అధికారుల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల మేరకు ప్రతి సంవత్సరం జూన్ 20న రెవెన్యూ డే సెలెబ్రేషన్స్ జరిపేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ ఢిల్లీరావు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి శ్రీనివాస్, బత్తిన రామకృష్ణతో పాటు అసోసియేషన్ సభ్యులు నుదురుమాటి శ్రీనివాస మూర్తి, వి.సాయి మహేష్ బాబు, ఎస్‌వి రవీంద్రనాథ్, యన్.అనుష్ కుమార్, రాష్ట్ర నాయకులు పి.జాహ్నవి, కలెక్టరేట్ యూనిట్ నాయకులు ఎ.రాజేష్ విజయవాడ డివిజన్ నాయకులు యలమంచిలి రవి పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ గవర్నర్‌పేట క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీశంకర్ పర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

23న ఉచిత నేత్ర వైద్యశిబిరం

విజయవాడ : అజిత్‌సింగ్‌నగర్ సుందరయ్యనగర్ విశాలాంధ్ర కాలనీలోని ఎస్‌జి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అయాన్ 'ఐ' ఆసుపత్రి ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ తెలిపారు. అయాన్ 'ఐ' ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ నేతృత్వంలో అనుభవజ్ఞులైన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శుక్లాలు, రెటినోపతి, నీటికాసులు, నల్లగుడ్డు, మెల్లకనున్న, మైగ్రేన్ తదితర పరీక్షలు అధునాతన పరికరాల ద్వారా ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐడ్రాప్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లకు రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయితీ కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రైవేట్ స్కూల్స్‌లో జర్నలిస్ట్ పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని మచిలీపట్నం మీడియా మిత్రులు ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు బుధవారం రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. స్థానిక రహదారులు భవనము ల శాఖ అతిథి గహంలో మంత్రి రవీంద్రని మచిలీపట్నంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులు కలిశారు. 2014-19 సంవత్సర కాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రతి సంవత్సరం సర్క్యులర్ విడుదల చేశారన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వంద శాతం ఫీజు రాయితీని పూర్తిగా నిలిపివేయడం వల్ల ఫీజులు చెల్లించే విషయంలో జర్నలిస్టులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గతంలో అమలు చేసిన ఫీజు రాయితీ ఉత్తర్వులను తిరిగి పునరుద్ధరించాలని జర్నలిస్టులు మంత్రి కొల్లు రవీంద్రని కోరారు. దీనిపై స్పందించిన రవీంద్ర జిల్లా విద్యాశాఖాధికారిణి తాహేరా సుల్తానాను పిలిచి ఫీజు రాయితీకి గల అవకాశాలను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు.

రేపు యోగా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని సాత్విక్ యోగా నిర్వాహకుడు కష్ణ తెలిపారు. ఏవీఆర్ మెమోరియల్ హాల్ (ధార్మిక భవన్) లో కొద్దిరోజులుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈనెల 21న అతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పెద్ద యెత్తున యోగా వేడుకలు నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9502876748 నంబరుకు సంప్ర దించవచ్చని తెలిపారు

రక్తహీనత రహిత జిల్లానే లక్ష్యం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి



ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ గీతాబాయి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సికిల్ సెల్ వ్యాధి ద్వారా ప్రజలలో కలిగే రక్తహీనతను 2047 నాటికి నిర్మూలించే లక్ష్యంతో జిల్లాలోని 0 నుండి 40 సంవత్సరాల మధ్య వయసున్న వారందరకు ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి- డాక్టర్. జి. గీతాబాయి పేర్కొన్నారు. జూన్ 19 న ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ జి .గీతాబాయి అవగాహన ర్యాలీని జిల్లా కార్యాలయం నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీనితో పాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ లలో అవగాహన ర్యాలీలు , సదస్సులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్నామని, సికిల్ సెల్ వ్యాధి వారసత్వంగా మాత్రమే తల్లిదండ్రుల నుండి అనువంశికంగా సంక్రమిస్తుం దన్నారు. ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి గాలి ,నీరు, చర్మ స్పర్శ ,ఆహార అలవాట్లు మొదలైన వాటి ద్వారా ఈ వ్యాధి సోకదని అన్నారు. దీని ముఖ్య లక్షణాలు రక్తహీనత ,కళ్ళు పసుపు రంగులో మారటం ,తీవ్రమైన ఒళ్ళు నొప్పులు మరియు కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటువ్యాధులు ,గర్భధారణ సమయములో సమస్యలు, అవయవ వైఫల్యం, పెరుగుదల సమస్యలు మొదలైన లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. ఆరోగ్యకరమైన జీవనం జీవనశైలిని అనుసరించుట, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లకుండా ఉండుట మొదలైన వాటిని తప్పనిసరిగా పాటించా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఏ. సీతాకుమారి , కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వేములపల్లి లక్ష్మి అన్నపూర్ణమ్మ గర్ల్స్ హైస్కూల్ , శ్రీ ముక్కామల జగదీశ్వరరావు దావాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7,8,9,10వ తరగతి బాలికలకు యుక్త వయస్సులో వచ్చే మార్పులు, రుతుశ్రావ సమయంలో తీసుకోవలిసిన జాగ్రతలు, తీసుకోవలసిన ఆహారంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ , వాసవ్య మహిళా మండలి వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాసవ్య మహిళ మండలి డైరెక్టర్ లు విజయ, హాసిని లు బాలికలకు



అవగాహన కలిగించారు. స్కూల్ ఉపాధ్యాయులు ప్రసన్న , పార్వతి , గీత, బాలికలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



గుడ్లవల్లేరు మండలంలో...

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు గ్రామ ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇ. వాణి ఆధ్వర్యంలో మన అంగన్వాడిలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్నపిల్లల అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు పౌష్టికాహారంతో పాటు క్రమశిక్షణ అలవాటు చేస్తామని తెలిపారు. ఏఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, అహంకాలమ్మ భ్రమరాంబ, నాగమణి ఏసు మణి, రమణశ్రీ తల్లులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురంలో అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. మూడు సంవత్సరాల నిండిన పిల్లలను అంగన్‌వాడీలోల చేర్పించాలని అంగ న్వాడి సూపర్వైజర్ ఎం. ఝాన్సీ రాణి అన్నారు. ప్రభుత్వం ఇచ్చే పోషక విలువైన ఆహారాన్ని అందుపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరంకి బలుసులమ్మ, అంగన్వాడీ టీచర్లు పరమేశ్వరి, ఆనంద కుమారి, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** సాయి పురం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్డే నిర్వహించి ప్రీ ప్రైమరి పూర్తిచే సుకున్న పిల్లలకు సర్టిఫికెట్లు అందజేసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలలకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించి సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ జాన్భాష అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, హేమ, అంగన్వాడీ కార్యకర్త కె. భాగ్యలక్ష్మి, స హాయకురాలు రాణి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని పాముల లంక గ్రామంలో బుధవారం మన అంగన్వాడీ పిలుస్తోంది.. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహిం చారు. అంగన్వాడి సూపర్వైజర్ సుజాత, అంగన్వాడి కార్యకర్తలు వనిత, సంధ్య, ఈడుపుగంటి రాణి, పార్వతి, లక్ష్మి తదితర అంగన్వాడి ఆయా వర్కర్లు,గ్రామంలోని పలువురు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వం పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎలమర్రు సచివాలయ పరిధిలో అంగన్వాడి కేంద్రాల చిన్నారుల గ్రాడ్యుయేషన్ దినోత్సవం వేడుకల్లో అంగన్వాడీ సూపర్వైజర్ అరుణ్ కుమారి అన్నారు. బుధవారం ఐదేళ్ల నిండి అంగనవాడి పాఠశాలలో చేర్చేందుకు సిద్ధమైన చిన్నారులు బాల బాలికలకు అంగనవాడి సర్టిఫికెట్ బహుకరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కళ్యాణి ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ వాణి ద్రౌపతి, విజయ కుమారి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు. **ప్రజాశక్తి- కోడూరు :** కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని మెరకగౌడపాలెం అంగన్వాడి కేంద్రం నందు కోడూరు లోని అంగన్వాడీ కార్యకర్తలు కలిసి ప్రీస్కూల్ విద్య పూర్తి చేసుకుని 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ పి.రాజేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



కోడూరు మండలంలో...



తోట్లవల్లూరు మండలంలో...



ఉత్తమ హెచ్‌ఎంలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అభినందన కార్యక్రమం కొత్తపేట రోటరీ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. రోటరీ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ ఎంసీ.దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు క్వాలిటీ విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పినట్టుగా విద్యార్థులు చదువుకుంటే ఉత్తమ ర్యాంకులు సాధించడం సులభం అవుతుందన్నారు. 23-24 సంవత్సరానికి 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు కషిచేసిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యా యులను సత్కరించడం సమచితమన్నారు. డీఈవో తహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మంచిర్యాంకులు సాధించడం ద్వారా కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థులతో పోటీపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివద్ధిలో దాతల భాగస్వామ్యం అవసరమన్నారు. ముస్తాబాద, వీరపనేనిగూడెం, రావాజీ గూడెం, గన్నవరం బాలికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. చినఆవుటపల్లి పుణ్య చారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్ కుమార్, రోటరీ క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామయ్య, రొటేరియన్లు గన్న వెంకట్రావు, కాసరనేని బాబురావు, చింతపల్లి సీతారామయ్య, టి ఎస్ ఆర్ కే ప్రసాద్,గొట్టం రవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మల రామానాయుడును సత్కరిస్తున్న దృశ్యం

మంత్రి నిమ్మలకు అభినందనలు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర టిడిపి నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు,రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు,గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పొత్తూరు రామాంజనేయ రాజు తదితరులు కలిసి పుష్పగుచ్చము అందించి అభినందనలు తెలియజేశారు.

రూ.2 లక్షల విరాళం


ప్రజాశక్తి-గన్నవరం : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ సేవాసదనం నిర్మాణానికి గన్నవరానికి చెందిన కొడాలి ఈశ్వర ప్రసాద్, సంధ్యారాణి దంపతులు 2 లక్షలు రూపాయలు విరాళంగా ఆలయ కమిటీకి బుధవారం అందజేశారు. తాడేపల్లిగూడెం కు చెందిన లంక శ్రీనివాస్ దంపతులు 50 వేల రూపాయలు విరాళం ఆలయ కమిటీకి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ సభ్యులు పొట్ల శివలీల తదితరులు పాల్గొన్నారు.



పవన్ కళ్యాణ్‌కు చిత్రపటం అందజేస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఇఒ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, వాతావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ) మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో కనకదుర్గ అమ్మవారికి, దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఉప ముఖ్యమంత్రికి వేద పండితులచే వేదాశీర్వచనం కల్పించారు. శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు అందజేశారు.



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

గ్రంథాలయానికి బుక్ ర్యాక్‌లు బహూకరణ

విజయవాడ : గవర్నర్ పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్-1 , విజయవాడ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువైన 15 ఐరన్ బుక్ ర్యాక్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లబ్బీపేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎం.వి.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధిలో తాము భాగస్వాములు అవటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ ఠాగూర్ గ్రంథాలయం ఎంతో మంది పేద విద్యార్థులకు, చదువరులకు బాసటగా నిలుస్తుందని, ఇక్కడ చదువుకుని ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించారని, అటువంటి గ్రంథాలయ అభివృద్ధికి తమవంతు సహకారంగా ఈ బుక్‌ర్యాకులను బహుకరిస్తున్నామని తెలిపారు. విజయవాడ జోనల్ మేనేజర్ డి.విజయ కుమార్ గారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతున్న ఈ గ్రంథాలయానికి తమ వంతు సహకారం చేస్తున్నామన్నారు. అనంతరం వీరికి గ్రంథాలయ అధికారి కె.రమాదేవి శాలువా, జ్ఞాపికతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొని దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు



వీధి దీపాలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో సి.వి.ఆర్. ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శివశక్తి నగర్ వాసుల ఎన్నో ఏళ్ళ ఎదురు చూపు ఇన్నాళ్లకు ఫలించాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పర్యటనలో భాగంగా టిడిపి నాయకులు బొమ్మసాని సుబ్బారావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే ఎంఎల్ఎ సుజనా చౌదరి పర్యటన సందర్భంగా స్థానికులు తమ గోడు మొరపెట్టుకున్నారు. తాము నివాసానికి చేరుకోడాని చిమ్మ చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని తెలిపారు. స్పందించిన సుజనా చౌదరి బొమ్మసాని సుబ్బారావు చొరవతో ప్రస్తుతానికి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఈ వీధి దీపాలు స్విచ్ ఆన్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. శివశక్తి నగర్‌లోని సాయి అమరావతి హైట్స్, అస్త్ర అపార్ట్‌మెంట్, విఘ్నేష్ హైట్స్ అసోసియేషన్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై

మురుగు నీటితో అవస్థలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విజయవాడ భద్రాచలం జాతీయ రహదారిపై కొండపల్లి బి కాలనీ వద్ద మురుగునీరు జాతీయ రహదారిపై చేరి వాహనదారులను తీవ్ర అవస్థలకు గురిచేస్తోంది. జాతీయ రహదారి మరమ్మతుల సమయంలో మురుగు నీటి కాలువలను జెసిపి సహాయంతో తవ్వి, మరమ్మతులు చేపట్టకుండా వదిలి వేయడంతో, కాలవల్లోని మురుగనీరు జాతీయ రహదారిపై చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పాదచారులు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై మురుగునీరు చేరడంతో దోమలు చేరి స్థానికంగా ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్య సమస్యలు పెరుగుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొండపల్లి మున్సిపాలిటీ అధికారులు, జాతీయ రహదారి నిర్వహణ



అధికారులు దీనిపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని మృతి చెందినట్లు కృష్ణలంక సిఐ మురళీ కృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణలంక గుంటూరు వారి వీధి నివాసి అయిన తాడికొండ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి (35) బస్టాండ్ సమీపంలో ఉరేసుకొని మృతి చెందాడు. ఇతను కాషాయ రంగు టి షర్టు, సిమెంట్ కలర్ నిక్కరు ధరించి ఉన్నాడు. మృతుడికి సంబంధించిన వివరాలేమైనా తెలిస్తే 9440627086 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.



జర్నలిస్టుల సమస్యలపై సౌమ్యకు వినతి

ప్రజాశక్తి - నందిగామ : జర్నలిస్టులందరికీ ఆక్రిడేషన్ మంజూరు



సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చేయాలని విజ్ఞప్తి చేస్తూ నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్యకు బుధవారం నందిగామ జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులుగా పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఒక్క జర్నలిస్టుకు ప్రమాద బీమా వర్తించాలనే అనేక డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని నందిగామ ఎంఎల్‌ఏ తంగిరాల సౌమ్యకు జర్నలిస్టులు అందజేశారు. అనంతరం జర్నలిస్టులు ఎంఎల్‌ఏ సౌమ్యను శాలువా, పుష్పగుచ్చాలు, స్వీట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్, ఏచూరి శ్రీనివాసరావు, ఘంటా వీరభద్రరావు, కోట సుభాష్, పఠాన్ సైదాఖాన్, గుడిమెట్ల అనంత్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నూతన విద్యా సంవత్సరం ఆరంభమైన సందర్భంగా నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామంలో ఎంపియూపి పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం వారు ఉచితంగా అందజేస్తున్న స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ అనంతు విశ్వనాధం పాల్గొని స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కూటమి నాయకుల పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మైలవరం : రాష్ట్రంలో ఎన్డీఏ మహా కూటమి గెలుపు, చంద్రబాబు సిఎంగా బాధ్యతలు స్వీకరించడాన్ని, వసంత ఎంఎల్ఏగా గెలుపొందడాన్ని పురస్కరిం చుకుని కూటమి నాయకులు పాదయాత్ర నిర్వహించారు. బుధవారం జి.కొండూరు నుండి జమలాపురం వరకు పాదయాత్ర చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జి.కొండూరు టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, లంకా రామకృష్ణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు ర్యాలీ ప్రారంభించారు.



దుర్గగుడిలో పల్లకీ సేవ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ గంగాదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పల్లకీ సేవలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు పాల్గొని పల్లకీని మోశారు. అమ్మవారి పంచహారతుల అనంతరం, అందరి భక్తులతో పాటుగా క్యూ లైన్‌లో వచ్చి, యాత్రికులతో మాట్లాడుతూ అభిప్రాయ సేకరణ చేస్తూ అమ్మవారిని ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు దర్శించుకున్నారు. ప్రతి రోజు సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ జరిగే గంగాదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పల్లకీ సేవలో పాల్గొని పల్లకీని మోశారు.




విద్యుద్ఘాతంతో పాడిగేదెలు మృతి

ప్రజాశక్తి - తిరువూరు : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి మరో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. తిరువూరు మండలం మునకుల గ్రామంలో జరిగిన ఈవిషాద ఘటనకు పేద రైతులు లబోదిబో మంటున్నారు. గ్రామానికి చెందిన రైతు కొంగల అంజయ్యకి సంబంధించిన రెండు పాడి గేదెలు మేతకోసం అక్కపాలెం రోడ్డులోకి వెళ్లాయి. ఆ ప్రాంతంలో మూడ్రోజుల క్రితం విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్ వైర్ తాకి అదే గ్రామానికి చెందిన ఒక రైతు పాడి గేదె మృతి చెందింది. ఆ మృతకళేబరాన్ని తీయకుండా అలాగే ఉంచారు విద్యుత్ అధికారులు. అయితే అంజయ్యకు చెందిన రెండు పాడి గేదెలు ఆ మృతకళేబరాన్ని తాకడంతో అవికూడా షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమకు తగు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విసన్నపేట : స్థానిక మండల కేంద్రంలో ఎమ్ఎస్‌సి చదువుతున్న విద్యార్థిని మేసుపాం ప్రణీతకు తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు రూ.30 వేలు ఆర్థిక చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మట్టా వేణు గోపాలరావు, ఆర్‌బిఎస్ జాతీయ అధ్యక్షులు సీనియర్ టిడిపి నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, తెలుగు మహిళ ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల నాగమణి, పల్లెపాం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి సాయం అందజేస్తున్న కొలికపూడి

పోర్టు పనులు పరిశీలన

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పోర్టు, రెవెన్యూ అధికారులతో పోర్టు నిర్మాణ ప్రాంతానికి చేరుకుని అక్కడ జరుగుతున్న పురోగతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రెడ్జింగ్, బ్రేక్ వాటర్, బెర్త్ నిర్మాణ ప్రాంతాలకు చేరుకుని పురోగతి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలిత ఆయన రోడ్ కం రైలు మార్గంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులతో పాటు ఆ మార్గంలోని భూ సమస్య ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న స్థలాలకు సమస్య పరిష్కారం అయ్యిందని, మిగిలిన అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అసైన్డ్ భూములకు సంబంధించి హక్కుదారులను గుర్తించాలని, సరైన పత్రాలను సమర్పించిన వారికి నష్టపరిహారం చెల్లింపునకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. భూ సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యాయని, ఈ నేపథ్యంలో పోర్టు నిర్మాణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పోర్టు అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో మచిలీపట్నం పోర్టు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై విద్యాశంకర్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ టీం లీడర్ విశ్వనాథం, బందరు ఆర్డిఓ ఎం వాణి, తహసిల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పోర్టు పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు



డిఎంకు సమస్యలు తెలియజేస్తున్న పవన్‌కుమార్

ఆర్‌టిసి డిఎంకు సమస్యల మొర

ప్రజాశక్తి-మోపిదేవి : ఆర్టీసీ డిఎం కొక్కిలిగడ్డ హనుమంతరావు మోపిదేవి వచ్చిన సందర్భంగా మోపిదేవి సెంటర్లో మోపిదేవి ఎంపీటీసీ-2 కొమ్ము పవన్ కుమార్ డిఎం ను కలిసి పలు ఆర్టీసీ సమస్యలను వివరించారు. వాటిల్లో ప్రధానంగా మోపిదేవి నుండి రావివారిపాలెం, బోడగుంట వెంకటాపురం మీదుగా చల్లపల్లి వెళ్లే మచిలీపట్నం సర్వీసును నూతనంగా ప్రవేశపెట్టాలని కోరారు. రెగ్యులర్గా మచిలీపట్నం వెళ్లే సర్వీసులలో ఒకటి వెంకటాపురం మీదుగా ఉదయం టైంలో అందరికీ అనుకూలంగా విద్యార్థులకు ఉపయోగపడేలా మచిలీపట్నం బస్ సర్వీసును నడపాలని కోరారు. ఐదు గ్రామాలకు ఈ బస్సు సర్వీసు ఉపయోగపడుతుందని డిఎంకు ఎంపీటీసీ పవన్ తెలిపారు. ఆర్టీసీ డిఎం మాట్లాడుతూ త్వరలోనే ఈ బస్ సర్వీస్ ను నూతనంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



'నేను బడికిపోతా' ర్యాలీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 'నేను బడికిపోతా' కార్యక్ర మంలో భాగంగా మండలంలోని అంగలూరు గ్రామంలో ఎంఈఓ1 జగన్మోహన్‌రావు, ఎంఈఓ 2 గోపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బడిలో చేర్పించారు.

చేనేత వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా చేనేత, జౌళి శాఖ మచిలీపట్నం వారి పర్యవేక్షణలో జిల్లా చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో మచిలీపట్నం ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా గల చిత్రకళ సంసద్ నందు నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందనిజిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాల కులు కే అప్పారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం, పరిసర ప్రాంతాల ప్రజలు తరలి వచ్చి వస్త్ర ప్రదర్శనలు తిలకించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కలంకారి వస్త్రములు ఈ వస్త్ర ప్రదర్శనలో అందు బాటులో ఉన్నాయన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని, సరసమైన ధరలకు చేనేత వస్త్రాలు లభిస్తాయని, మచిలీపట్నం, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలు, దుస్తులను ఉపయోగించుకోని చదువులో రాణించాలని వేల్పూర్ గ్రామ సర్పంచ్ దిలీప్ కుమార్ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని వేల్పూరు, లంకపల్లి, కృష్ణాపురం, మంటాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతతోపాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లంకపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ వేమూరి రత్నకుమారి, కృష్ణాపురంలో గ్రామ సర్పంచ్ వీరంకి బలుసులమ్మ, సిఆర్పి రవితేజ, వీరంకి ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం



వెనిగండ్ల రామును అభినందిస్తున్న ఐఎంఏ వైద్యులు

వెనిగండ్లకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పెద్దలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఎంఎ అధ్యక్షుడు డా॥పాలడుగు వెంకట్రావు, ఉపాధ్యక్షుడు డా॥మాగంటి శ్రీనివాస్, సభ్యులు వైద్యులు కొనుకొల్లు శ్రీనివాస్, ఉండవల్లి సురేష్ కుమార్‌లు ఎమ్మెల్యే రాముకు నోటు పుస్తకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొట్లూరు వంశీ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 215 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : యువత అవకాశాలు అందుకుని ఎదగాలని వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. సాఫ్ట్ వేర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్ విభాగాలకు సంబంధించిన 16 రకాల కంపెనీల హెచ్ఆర్ విభాగం ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు చల్లపల్లి, అవనిగడ్డ, రేపల్లె, మచిలీపట్నం, గుడివాడ పరిసర ప్రాంతాల నుండి వివిధ కళాశాలలకు చెందిన 515 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరవగా, 215 మందికి కంపెనీల ఆఫర్ లెటర్లను అందచేశారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు, కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ,విద్యార్థులు

రామకృష్ణకు నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : పర్యావరణ పరిరక్షణకు బలరాం కషి మరువలేనిదని టీడీపీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధి లోని వక్కలగడ్డలో దివంగత జడ్పీటీసీ సభ్యులు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు దివంగత తాతినేని రామకృష్ణ (బలరాం) వర్ధంతి ఘనంగా జరిగింది. బలరాం విగ్రహానికి, స్మారక స్థూపానికి రాంబాబు, తాతినేని సాయి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ టీడీపీ అభివద్ధికి బలరాం విశేష కషి చేశారన్నారు. వక్కలగడ్డ సర్పంచుగా అన్ని ప్రధాన రహదారుల వెంట విస్తతంగా మొక్కలు నాటించారన్నారు. జడ్పీటీసీగా మండలంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయ రాధిక, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు పోతుమర్తి నాగమణి, ఎంపీటీసీ మట్టా కోమలి, కోట పద్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలరాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉపాధి హామీ పథకం కార్మికులకు అన్ని గ్రామాల్లో పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం వెంకటేశ్వరరావు పాత్రికేయుల తో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు ,హామీలకు మాత్రమే పరిమితమై ఆచరణలో కనుమరుగ వుతుందన్నారు. భూ మిని నమ్ముకుని బతుకుతున్న వ్యవసాయ కూలీలకు రోజురోజుకు గ్రామాల్లో వ్యవసాయ పనులు కనుమరుగవుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాంత్రికరణ ద్వారా వ్యవ సాయం కొనసాగుతుందని, తద్వారా వ్యవసాయ పనులు అందడం లేదని అన్నారు. సంవత్సరంలో 50,60 రోజులకు మించి వ్యవసాయ పనులు దొరకని స్థితి ఏర్పడు తుందని ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని భూమి మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మిక జీవులకు ఉపాధి పథకం ద్వారా కనీసం గా 200 రోజులు పని కల్పించా లని అన్నారు. అదేవిధంగా రూ.600లు దినసరి వేతనంగా చెల్లించాలని గత కాలము నుండి ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విన్నవించినా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న వ్యవసాయ కార్మికుల జీవన విధానం మారడం లేదన్నారు. నూతనంగా అదికారంలోకి వచ్చిన ప్రభుత్వాలైన దీనిపై దష్టి సారించి అట్టడుగున ఉన్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటు అందించాలన్నారు, అలాగే గత ఐదు వారాలుగా చెల్లించవలసి ఉన్న వేతన బకాయి లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఐటిఐలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గుడివాడ : ఐటిఐలలో ప్రవేశాలకు కష్ణాజిల్లాలో అడ్మిషన్స్ కొరకు ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21,22,24 తేదీలలో జరిగే ఐటిఐ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కె.బి.ఆర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్, గుడివాడ ప్రిన్సిపల్ ఎల్.గౌరిమణి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లుతో మాట్లాడుతూ ఈనెల 21,22, తేదీలలో జరిగే ఇంటర్వ్యూలకు ఉదయం 8గం॥ల నుండి నిర్వహిస్తునట్లు తెలిపారు. అడ్మిషన్స్ కౌన్సిలింగ్‌లో కష్ణాజిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరదలచిన అభ్యర్థులు ఆయా మెరిట్ నెంబర్ ప్రకారం ఈ క్రింది తేదీలలో మీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులలో యస్.సి, యస్.టి, వారు మినహా మిగిలిన అన్ని కేటగిరీ అభ్యర్థులు రూ.60లు డిపాజిట్ చెల్లించాలన్నారు. మెరిట్ నెంబర్ కొరకు కె.బి.ఆర్. ప్రభుత్వ ఐ.టి.ఐ.లో హెల్ప్ డెస్క్ లో సంప్రదించాలన్నారు ఇతర వివరములకు 08674295953, 9985162555, 82975 74757, 8555952320 ఫోన్‌నెంబర్లను సంప్రదించాలన్నారు.

23న వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి- గన్నవరం : ఈ నెల 23వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలకు గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని వాకర్స్ అసోసియేషన్ తొలి కార్యవర్గ సమావేశం జరుగుతుందని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే వి.ఆర్ కిషోర్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో క్రీడా ప్రాంగణం లో ఇప్పటివరకు జరిగిన అభివద్ధి, వెచ్చించిన ఖర్చు, వసూలు అయినా సభ్యత్వ రుసుము, దాతలు నుంచి సేకరిచిన నిధులు వివరాలు, నూతన కార్యవర్గం భవిష్యత్తు కార్యచరణ తదితర అంశాల పై చర్చించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవిఆర్ కిషోర్ తెలిపారు. కావున వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రతి ఒక్కరూ కార్యవర్గ సమావేశానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కిషోర్ కోరారు



పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి శిఖరాలకు ఎదగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భీమవరంలోని ఎంపీపీ పాఠశాలలో జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోట్ పుస్తకాలు పిల్లలకు జిఎంఆర్ అందించటం చాలా అభినందనలు రాయటం అని అన్నారు. జిఎంఆర్ ప్రతినిధులు ప్రభంజన్ బాస్, రాఘవ జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ నరేష్ సిహెచ్.సునీత, రవీంద్రనాథ్, ఎస్‌కె జానీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న రాజ్‌కుమార్

విద్యార్థులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో మండల జిల్లా పరిషత్ హైస్కూల్ ,ఎంపిపి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు గ్రామ సర్పంచ్ తుల్లిమల్లి రాజ్ కుమార్ పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యకోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. కంచికచర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డ్ నెంబర్ చాగంటి రామారావు, మాజీ సర్పంచ్ గుదేరంగారావు, ఐటిడిపి కోఆర్డినేటర్ నెట్టెం ప్రభాకర్‌రావు, బండ్లమూడి చౌదరియ్య, గొర్రెపాటి జాషువా, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపియుపి స్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన స్టూడెంట్స్ విద్య కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూల్‌లో ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్న జిల్లేపల్లి సుదానంద్ వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థంగా ఇచ్చిన మెమెంటోలను విద్యార్థులకు అందజేశారు. పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల కిట్లను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అందజేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నాడు-నేడు పాఠశాల భవనంలో అవకతవకలపై స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని అన్నారు. గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు అందించిన స్టూడెంట్ కిట్లను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేలవెల్లి రమేష్‌బాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ నాయకులు కొఠారు సత్యనారాయణ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ రమాదేవి హాజరై విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, టైలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : ముఠా, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని ఊటుకూరు గ్రామంలో పలు ముఠా కార్మిక సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, గత పాలకులు ముఠా కార్మికుల హక్కులను కాల రాసిన విషయాన్ని గుర్తు చేశారు. తాము గడిచిన ఐదేళ్ల ఉద్యమ ఫలితాలే బిజెపి తగ్గుదలగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా నాయకులు గద్దల శేషయ్య, రైతు సంఘం నాయకులు ఎన్ జె చారి, జిల్లా సిఐటియు కార్యదర్శి వెంకటేశ్వరరావు పలువురు ముఠా నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, ముఠా కార్మికులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి పద్మ

ప్రజాశక్తి - తిరువూరు : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి పి.పద్మ బుధవారం తిరువూరులోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సాగు మొదలవుతున్న తరుణంలో డీలర్ల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు. ఇన్ వాయిస్‌లు లేకుండా స్టాక్స్ తీసుకురాకూడదని, సోర్స్ సర్టిఫికెట్ ఉన్న స్టాక్ మాత్రమే అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, గరిష్ఠ చిల్లర ధర మించకుండా విక్రయించాలని డీలర్లకు సూచించారు. లైసెన్సు పొందిన ప్రతి డీలర్ తప్పనిసరిగా ప్రతి రోజు స్టాక్ బోర్డు అప్డేట్ చేయాలని, మండల వ్యవసాయ అధికారి సర్టిఫై చేసిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు మాత్రమే వినియోగించాలని సూచించారు. కొత్త గోడౌన్లు కొనుగోలు, లీజుకు తీసుకుంటే అధికార పత్రాలను లైసెన్సులో ఎమెండ్‌మెంట్ చేయించుకొని రైతులకు విక్రయించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుమతిలేని కంపెనీల వద్ద కొనుగోలు చేయరాదని, అటువంటి నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించే డీలర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

వాహనాల వేలం ద్వారా రూ.98 వేలు ఆదాయం

జగ్గయ్యపేట : పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో మైలవరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సి భార్గవ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలకు అనూహ్య స్పందన వచ్చినట్లు తెలుస్తుంది. 8 ద్విచక్రవాహనాలకు మరియు ఆటోలకు నిర్వహించిన వేలంపాటలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద యెత్తున వేలం పాట దారులు హాజరయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.62,500లకు గాను వేలంపాటలో రూ.98,800 లు ఆదాయం లభించిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 58.08శాతం పెరుగుదల కనిపించిందన్నారు. జీఎస్టీ రూపంలో రూ.17,784లు ఆదాయం అన్నారు. ఏప్రిల్‌లో జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో 52 కేసుల్లో స్వాధీనం చేసుకొన్న 1752 లీటర్ల మద్యం, 67.75: లీటర్ల బీరు, 7.5 లీటర్ల తాటికల్లును తిరుమలగిరి సమీపంలో ఉన్న ఆటోనగర్ సమీపంలో ధ్వంసం చేశారు.



స్థానిక సమస్యలు పరిశీలిస్తున్న కొలికపూడి శ్రీనివాస్

కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి - విసన్నపేట : బుధవారం విస్సన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన తిరు వూరు నియోజక వర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో మండలంలోని కలగల గ్రామపంచాయతీలో గల డ్రెయినేజీ సమస్యల గురించి గ్రామ నాయకులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పంచాయతీ సెక్రటరీతో ఫోన్లో మాట్లాడి వర్షాకాలం కాబట్టి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో నాయకులతో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి సాగునీరు తాగునీరు చెరువుల పూడికలు కాలవలు వ్యవసాయ పనులు గురించి చర్చించారు.

చినుకు పడితే చెరువే

ప్రజాశక్తి - తిరువూరు : నిత్యం జనసంచారంతో, వాహనాలతో రద్దీగా ఉండే తిరువూరు పట్టణంలోని ఇందిరా కాలనీ మధిర రోడ్డు ఆర్ అండ్ బి రహదారి చిన్న పాటి వర్షం పడినా చెరువును తలపిస్తూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంతంలో నీళ్లు నిలబడకుండా మధిర రోడ్డుకు ఇరువైపులా పక్కా డ్రెయినేజీ నిర్మిస్తామని ఎంఎల్ఎగా పోటీచేసిన అభ్యర్థులు ప్రజలకు వాగ్దానం చేస్తున్నారు. కానీ గెలిచిన తరువాత నీటి మూటలాగే మిగిలిపోతుంది. ఈ రోడ్డుకు ఇరువైపులా పేద, మధ్యతరగతి దళితులు నివసిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా నీళ్లన్నీ ఇళ్లలోకి రావటంతో దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెలిచిన ఎంఎల్ఎలు మాత్రం మద్దిర రోడ్డు సెంటర్ నుండి దేవసముద్రం వరకు డ్రైనేజీ నిర్మాణానికి ప్రతి పాదనలు తయారు చేసి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని,



నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి నెలరోజుల్లో పూర్తి చేస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. అయితే దీర్ఘ కాలంగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని నూతన ఎంఎల్ఎగా కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం మధిర రోడ్డు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. అయన ప్రాంతాన్ని సందర్శించి యుద్ధ ప్రాతిపదికన కాలువలు తీయించాలని నగర పంచాయతీ కమీషనర్‌కు అయన ఆదేశాలిచ్చారు.



వేడుకల్లో నాయకులు

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మైలవరం : కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక బోసు బొమ్మ సెంటర్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు శీలం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని విమర్శించారు. రాహుల్ గాంధీ ని ప్రధానిని చేసేవరకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, డిసిసి కార్యదర్శి మసనం సుధాకర్, బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసపాటి గిరిధర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రక్తహీనత గురించి మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న లీలావతి పాఠశాల విద్యార్థులు


రక్తహీనతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లీలావతి పాఠశాలలో బుధవారం ప్రపంచ రక్తహీనత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రక్తం శాతాన్ని పెంపొందించుకోవాలని, పోషక విలువల గల ఆహార పదార్థాలను, తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాతయ్యకు రేషన్ డీలర్ల వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్యను ఆయన నివాసంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని డీలర్లు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తాతయ్యకు వివరించి, రాష్ట్రంలో ఉన్న 30 వేల మంది డీలర్ల భవితవ్యం కొరకు, రేషన్ పంపిణీ వ్యవస్థను, డీలర్ల చేతులు మీదుగా (రేషన్ షాపుల ద్వారా) పంపిణీ కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఈ విషయమై రాజగోపాల్ డీలర్లకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, సివిల్ సప్లై మినిస్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు అన్నెపాగ ప్రకాశరావు, పాపినేని శ్రీనివాసరావు, తాటి రామారావు, బొడ్డు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

డంపింగ్ యార్డులా... పంట కాలువలా...?

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ నుండి దివిసీమలోని నాగాయలంక, కోడూరు మండలాలకు సాగునీరు తాగునీరు అందించే పంట కాలవలు డంపింగ్ యార్డుల లేక పంట కాలవలా అనే అనుమానం ప్రజలకు కలుగుతుంది. వర్షాకాలం ప్రారంభం అయి ఖరీఫ్ సీజన్ కూడా మొదలవుతోందని, అయినా ఇప్పటివరకు పంట కాలవల్లో చెత్త పేరుకుపోయి మరోవైపు గుర్రపు డెక్క తూటుకాడలతో కాలువలన్నీ నిండిపోయి ఉన్నాయి. ఈ పరిస్థితి చూస్తుంటే రేపు సాగునీరు వదిలితే దిగువ ప్రాంతాలకు నీరు ప్రవహించే అవకాశమే కనిపించడం లేదు.కాలువల పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలు వ్యర్థాలను కాలువల్లోనే డంపు చేస్తున్నారు. దీనిని ఎక్కడ నివారించే పరిస్థితి గానీ అవగాహన కలిగించే పరిస్థితి గానీ సంబంధిత అధికారులు ఎవరు చేయకపోవడంతో కాలువలు అన్ని పూర్తిగా డంపింగ్ యార్డ్ లాగానే మారిపోయాయి. మరోవైపు దివిసీమలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో 51 రక్షిత మంచినీటి చెరువులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలు తాగునీరు వాడుకునేందుకు ఉపయోగించుకుంటున్నారు. విజయవాడ నుండి ప్రారంభమయ్యే ఈకేఈవీ కెనాల్ దుస్థితి ఎంత దారుణంగా ఉంటుందంటే విజయవాడలోని డ్రైనేజీ అంతా ఈ కాలువలోనే కలుస్తుంటుంది. ఆ నీటిని చెరువుల్లో నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నాగాయలంక మండలంలోని కమ్మనమోల చెరువు ద్వారా 15 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయవలసి ఉంది.అలాగే అవనిగడ్డ మండల పరిధిలోని రామచంద్రాపురం పంచాయతీలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి చెరువు ట్యాంకుల ద్వారా 9 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయవలసి ఉంది. ఈ నీరంతా గ్రామాలలోని చెరువులలో చేరడం ద్వారా ఆ నీటిని ప్రజలు అవసరాలకు వాడుకుంటున్నారు దీనితో వర్షాకాలం ప్రారంభమవుగానే కలుషితమైన నీటి వలన ప్రజలు విషజ్వరాలు అంటు వ్యాధులు బారిన పడుతున్నారు. ఆరోగ్య శాఖ వారు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆయా గ్రామాల మీద ప్రత్యేక దష్టి


అవనిగడ్డలో డంపింగ్ యార్డ్‌గా కనిపిస్తున్న కేఈబీ కెనాల్

సారిస్తున్నారు తప్ప మొదటి నుండి నీటి వాడకాన్ని తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులను పంట కాలువల మరమ్మత్తులపై వివరణ కోరగా తాము ఎన్నికల ముందే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులకు ఆటంకం కలిగాయని అన్నారు. దీనితో వర్షాలు కూడా ప్రారంభం కావడం సాగునీటిని కూడా విడుదల చేసే సమయం కూడా రావడంతో ఇక మరమ్మత్తులు జరిగే అవకాశం కనిపించడం లేదు. అందువల్ల సాగునీరు చివరి భూముల వరకు వెళుతుందని ఆశ కనిపించడం లేదు. దీనితో ఇప్పటివరకు సాగుకు నోసుకొని కాలువ చివరి భూములు ఈ ఏడాది కూడా పంటలు వేసుకునే అవకాశం కనిపించడం లేదు. దీనిపై నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం అధికారులు ప్రత్యేక దష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన పంట కాలువల మరమ్మతులు చేపట్టి వ్యర్థాలు తూటు కాడ గుర్రపు డెక్క తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. మరోవైపు డ్రైనేజీలు కూడా ఇదేవిధంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి పంటచేలు మునిగిపోయే పరిస్థితి ఉన్నందున డ్రైనేజీలను కూడా పూడిక తీయించాలని వ్యర్థాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


గుర్రపు డెక్కతో నిండిపోయిన పంట కాలువ

నడక, వ్యాయమంతోనే ఆరోగ్యం : ఎంఎల్ఎ


నడకదారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజంలో అందరు ఆరోగ్యవంతులైనప్పుడు అభివద్ధి సాధ్యమవుతుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఏజీఅంర్ఎస్ఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో బోడెప్రసాద్ పాల్గొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా బోడె ప్రసాద్ ను అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్చాలు, శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక, వ్యాయామంతో ఆరోగ్యం లభిస్తుందన్నారు. రాష్ట్రాభివద్ధికి కూటమి ప్రభుత్వం పునరంకింతం అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివద్ధి బాటలోకి తెచ్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. బోడెప్రసాద్, ఉయ్యూరు చైర్మన్ వి. సత్యనారాయణను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, అధ్యక్షుడు సత్తార్, కార్యదర్శి పూర్ణ, సభ్యులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల మాజీ చైర్మన్ జయదేవ్, సాయిపురం సర్పంచ్ వరప్రసాద్ పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి నివాళి



ప్రజాశక్తి-గుడివాడ : న్యాయవాది మాతంగి రామచం ద్రరావు మృతికి బార్ అసోసి యేషన్ సభ్యులు బుధవారం నివాళులర్పించారు. న్యాయవాది మాతంగి రామచంద్రరావు(ఎం.ఆర్.సి) ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మతి చెందారు. స్థానిక నాగవర ప్పాడులోని మాతంగి స్వగహంలో ఆయన మతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపినవారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి హరినాథ్, వైస్ ప్రెసిడెంట్ బొల్లవరపు.అజయ్‌బాబు, కె.శివప్రసాద్, అట్లూరి హేమంత్, ఎన్.నాగమణి ఉన్నారు.

చివరి భూముల వరకు సాగునీరందించాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు చివరి భూముల వరకు సక్రమంగా అందించాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం అవనిగడ్డలోని బుద్ధ ప్రసాద్ ఇంటి వద్ద ఇరిగేషన్ డ్రైనేజీ రివర్ కన్జర్వేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, నాగార్జునసాగర్ శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వస్తుందని ముందుగా తెలిసిన ప్పటికీ ఖరీఫ్ పనులు ప్రారంభానికి ముందుగా పంట కాలువలలో మరమత్తులు ఎందుకు నిర్వహించ లేదని, టెండర్లు ఎందుకు పిలవలేదని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. రానున్న ఖరీఫ్ సీజన్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రాజెక్టులలో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని అన్నారు. కష్ణా నదిలో ఇంతవరకు నీటి ప్రవాహం ఎక్కడా లేదన్నారు. పులిచింతల ప్రాజెక్టులో రెడ్ స్టోరేజీ కంటే తక్కువ నీరు 0.4 టీఎంసీలు నీరు మాత్రమే ఉందని, ప్రకాశం బ్యారేజీలు తాగునీటి కోసం నిల్వ ఉంచిన రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. గోదావరి నదిలో నీటిమట్టం పెరిగితే పట్టిసీమ ద్వారా కష్ణ డెల్టాకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ శాఖను పూర్తిగా విస్మరించిందన్నారు. రానున్న రోజులలో గోదావరి జలాలు పెరిగితే పట్టిసీమ ద్వారా కష్ణ డెల్టాకు రక్షణ అవుతుందన్నారు. ఇటువంటి భిన్నమైన పరిస్థితుల్లో తాత్కాలిక ఏర్పాటు చేసి సాగునీటిని సక్రమంగా అందించాలని ఇరిగేషన్ అధికారులను బుద్ధ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ పివిఆర్ కష్ణారావు, డ్రైనేజీ శాఖ గుడివాడ డివిజన్ ఈఈ విజయలక్ష్మి, ఆర్‌సిడి ఈ భాను బాబు, ఇరిగేషన్ డిఈ రవికిరణ్, డ్రైనేజీ టీవీ పి వెంకటేశ్వరరావు ఏఈలు పాల్గొన్నారు.

పోర్టు పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : బందర్ పోర్ట్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో పోర్ట్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బందరు పోర్టు పనుల పురోగతి, భూ సమస్యలు వాటి పరిష్కారం పై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బందరు పోర్టు నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని, అవరోధంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సమస్యల వల్ల ప్రాజెక్టు ఆలస్యం కాకూడదని, అవసరమైన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం పెండింగ్ చెల్లించుటకు చర్యలు తీసుకోవాలన్నారు జూలై 5న మరల పోర్టు పనుల పురోగతిపై సమీక్షిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, ఏపీ మ్యారీటైం బోర్డు ఎండి విద్యాశంకర్, బందర్ ఆర్డీవో ఎం వాణి, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపర్నెంట్ తేజేశ్వరరావు, బందర్ తాసిల్దార్లు తోట సతీష్ (ఈస్ట్) వెంకటేశ్వరరావు (వెస్ట్) తదితరులు పాల్గొన్నారు.



లంకా కాళిదాసు జీవిత చరిత్ర పుస్తకావిష్కణ చేస్తున్న దృశ్యం

లంకా కాళిదాసు జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : జీవితం మొత్తం పార్టీ కోసం నిలబడిన వ్యక్తి లంక కాళిదాసు అని సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్ తులసిరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి కామ్రేడ్ సుందరయ్య భవనంలో లంక కాళిదాసు ప్రథమ వర్ధంతి కార్యక్రమం సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సిపి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లంక కాళిదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తులసిరావు మాట్లాడుతూ కాళిదాసు పార్టీ కోసం నిలబడిన వ్యక్తి అని కొనియాడారు. నేటి రోజుల్లో ఒక పార్టీ నుంచి మరో పార్టీ కి మారే రోజుల్లో చివరి కంటూ తన జీవితంలో పార్టీ కోసం శ్రమించిన శ్రమజీవి అని తెలిపారు. సందర్భంగా లంక కాళిదాసు చిత్రపటాన్ని, జీవిత చరిత్రను పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణరెడ్డి, లంక సురేంద్ర, తమ్మిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి కె చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. డిఆర్ఓ తమ చాంబర్లో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా డే దినోత్సవం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్ సిద్ధం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. యోగ డే దినోత్సవం లో విద్యార్థులు, పాఠశాలల పిఈటిలు పాల్గొనేలా చూడాలని, విద్యాశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి జి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డి ఎస్ డి ఓ ఝాన్సీ, ఉప విద్యాశాఖ అధికారి శేఖర్ సింగ్, తాసిల్దారు తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న కె.పద్మావతి, (ఇన్‌సెట్‌లో) హాజరైన అధికారులు

కుష్టు నిర్ధారణపై అవగాహన

ప్రజాశక్తి - భవానీపురం : జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం (ఎన్‌ఎల్‌ఈపీ) కింద ఈ వ్యాధి నిర్ధారణపై అవగాహనకు (ఎల్‌సిడిసి) సంబంధించిన వర్క్‌షాప్ బుధవారం భవానీపురంలోని ఆలివ్ ట్రీ హోటల్‌లో నిర్వహించారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి అధ్యక్షత వహించిన ఈ వర్క్‌షాప్‌లో 26 జిల్లాల నుండి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారులు, డిఎన్‌ఎంఒలు/ టిబి మెడికల్ ఆఫీసర్లు టిహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. లెప్రసీ వ్యాధి నిర్ధారణకు సంబంధించిన ప్రచార కార్యక్రమం (ఎల్ సిడిసి) 18 జూలై 2024 నుండి 2 ఆగస్టు 2024 వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో దీనికి సన్నాహకంగా, జిల్లాల్లో ఎన్‌ఎల్‌ఇపి కింద అధికారులకు శిక్షణ ఇవ్వడానికి ఈ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. శిక్షణలో గుర్తింపు, రిపోర్టింగ్ ఫార్మాట్‌లు, లెప్రసీ గురించి అధికారులు, ఇతర సిబ్బందికి అవగాహన పెంచడంపై నిపుణులు పలు సూచనలు చేశారు. గతేడాది నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఫేజ్-1, ఫేజ్-2 ఎల్సిడిసి నుండి తెలుసుకున్న అంశాలపై ఈ వర్క్ షాప్‌లో డాక్టర్ పద్మావతి సమీక్షించారు. గతంలోని తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి ఈ సందర్భంగా ఆమె నొక్కి చెప్పారు. కుష్టు వ్యాధిని గుర్తించడం కోసం బృందాలు సర్వే చేసి, నిర్ధారణ కోసం ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరీక్షించేందుకు గానూ ఇళ్లను సరిగ్గా గుర్తించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. దీంతో పాటు కుష్టు వ్యాధి కేసుల నిర్ధారణ కోసం పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల్ని పరీక్షించేందుకు కచ్చితమైన ప్రణాళిక అవసరమన్నారు. సమాజంలో కుష్టు వ్యాధిని సమర్థవంతంగా గుర్తించడానికి సరైన ప్రణాళిక, అమలు చాలా కీలకమని ఆమె స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఎల్సిడిసి ప్రచారం సామర్థ్యాన్ని, ప్రభావాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 21న శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బెంజ్‌సర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ.రమణ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గత నెల రోజుల నుంచి తాము బందరురోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని తమ అసోసియేషన్ హాలులో యోగ శిక్షణా తరగతులను ఉచితంగా నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణకు 200 మందికిపైగా సాధకులు హాజరయ్యారని, వీరంతా కలిసి యోగా డే వేడుకల్లో పాల్గొని యోగాసనాలు వివరించారు. 9 సంవత్సరాలుగా అంతర్జాతీయ యోగాడేను తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏడాది వేసవి సెలవుల సందర్భంగా యోగా ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా నిర్వహించిన శిబిరంలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సాధకులకు అతిథులచే ప్రశంసా పత్రాలను, మెడల్‌ను అందచేస్తామని తెలిపారు.

అందరి సహకారంతోనే రోడ్డు ప్రమాదాలు నివారణ

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.ఎ.వి.ప్రసాదరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 8వేల మంది రోడ్డు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నారని ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎస్ఎవి.ప్రసాదరావు సూచించారు. ది కృష్ణ డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా సున్నపు బట్టీల సెంటర్లోని అమ్మ కళ్యాణమండపంలో రహదారి భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్ఎవి.ప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. హెల్మెట్ వాడకంపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అయితే ప్రజలెవరూ హెల్మెట్లను ధరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల భారి నుంచి తప్పించుకోగలరని సూచించారు. అనంతరం ట్రాఫిక్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ డి.ప్రసాద్ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫైనాన్స్ కంపెనీల వలన నగరంలో వాహనాల సంఖ్య పెరుగుతోందని తద్వారా ట్రాఫిక్ సమస్య జట్టిలమవుతోందని తెలిపారు. పిల్లలకు వాహనాలు కొనిచ్చే విషయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్నేక్ డ్రైవింగ్ వల్ల యువత ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. పాదచారులు తప్పనిసరిగా ఫుట్‌పాత్‌పై నడవాలని అన్నారు. అనంతరం ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని ఉచిత వైద్య సేవలతో పాటు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. ఈ నెల 22న మురళి ఫార్చ్యూన్ హోటల్‌లో తమ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకలు జరగనున్నాయని ఈ వేడుకలకు జాతీయ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు విచ్చేయనున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్ విజికె ప్రసాద్, ఫెడరేషన్ ఆఫ్ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ రాధాకష్ణతదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాదరావు

గ్రీన్‌బెల్ట్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలి


- కాలుష్య నియంత్రణ పోరాట సమితి అధ్యక్షుడు సురేష్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్‌సి ఎస్‌ఆర్ నిధుల కింద రూ.4 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించిన సంగతి విధితమే. వీటిపై కాలుష్య నియంత్రణ పోరాట సమితి అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్ బుధవారం విటిపిఎస్ ఎదురుగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.24 కోట్ల పైచిలుకు రావలసిన నిధులలో కేవలం రూ.4 కోట్లు మంజూరు చేయడం తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు. అందులో గ్రీన్ బెల్ట్ కోసం కేవలం రూ.30 లక్షలు మాత్రమే కేటాయించారని వాటితో కేవలం 700 మొక్కలు మాత్రమే నాటగలుగుతామని అన్నారు. 10 గ్రామాల్లో 700 మొక్కలు ఏమాత్రం సమంజసమో అధికారులే చెప్పాలని ప్రశ్నించారు. పోరాట సమితి డిమాండ్లను పరిష్కరించడంలో ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని అన్నారు. కాలుష్య నియంత్రణ కొరకు ముఖ్యమైన చర్యల్లో గ్రీన్ బెల్ట్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించాలని కోరారు. మంజూరు చేసిన నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల అభివద్ధి పనులు ప్రారంభించాలని అన్నారు. ప్రస్తుతం మంజూరు చేసిన నిధులతో అతి ముఖ్యమైన తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. బూడిద మీద ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పూర్తి నిధులు వచ్చేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పోరాట సమితి సభ్యులు షేక్ కరిముల్లా, మాధురి, రాజేంద్ర, భవానీ,అనీల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేష్

21, 22 తేదీల్లో ఇండియన్ స్టార్టప్స్‌పై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో 'ఇండియన్ స్టార్టప్స్ - సమస్యలు - సవాళ్లు - అవకాశాలు' అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ పారిశ్రామిక రంగ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం స్టార్టప్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతలోని నూతన ఆలోచనలకు ప్రోత్సాహాన్ని అందించి పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేసే దిశగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. ఆ క్రమంలో స్టార్టప్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. తద్వారా పారిశ్రామిక రంగానికి యువత అభ్యున్నతికి మేలు జరగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి 21న జరిగే ప్రారంభ సభకు స్థానిక శాసనసభ్యుడు, మాజీ కేంద్రమంత్రి వై.సత్యనారాయణ (సుజనా) చౌదరి ముఖ్యఅతిథిగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి.సుధాకర్‌రెడ్డి గౌరవాతిథిగా హాజరవుతారన్నారు. మలేషియాకు చెందిన ఏసియన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆచార్యులు ఆచార్య షరన్‌కుమర్‌షెట్టి కీలకపోన్యాసకునిగా, యుఎస్‌ఏకు చెందిన ఆచార్య సత్యనారాయణ పరియిటమ్ ప్రధాన వక్తగా పలు విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రముఖులు వక్తలుగా హాజరవుతారని వివరించారు. రెండో రోజు జరిగే ముగింపు సభకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ అండ్ సిఇఒ ఆచార్య డి.సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, అధ్యాపకులు హేమంత్ కుమార్, అరుణ్‌కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెబిఎన్ కళాశాల సెక్రటరీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నారాయణరావు

ఆధునిక టెక్నాలజీతో స్కోడా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇప్పటికే ఎన్నో మోడల్స్‌తో ఆకట్టుకున్న స్కోడా ఇండియా, దానికి కొనసాగింపుగా కుషాక్, స్లావియాలను అత్యాధునిక టెక్నాలజీతో తీసుకువచ్చినట్లు స్కోడా డైరెక్టర్ పీటర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫైవ్ స్టార్ రేటింగ్, పూర్తిగా ఉన్న కార్ల లైనప్‌కు మెరుగైన ప్రాధాన్యతను అనుమతిస్తుం దన్నారు. అన్నింటికి మించి పెద్దలు, పిల్లలు ఇద్దరికీ సురక్షితమైన కార్లు ఇవి అన్నారు. 'ఈ కొత్త కారుతో కొత్త మార్కెట్‌లు, యువ కస్టమర్‌లు, బ్రాండ్‌కు మరింత ప్రాప్యతను లక్ష్యంగా చేసుకున్నాం అన్నారు. తమ ఆఫర్‌లలో విలువను పెంచడానికి, తమ కస్టమర్‌లు, అభిమానులకు ప్రయోజనాలను అందించడానికి వీలు కల్పించిందన్నారు.

జనసేన సంబరాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తొలిసారిగా పదవి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో గంపలగూడెం మండల జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించారు. 2019లో ఇచ్చిన మాట మేరకు ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన సంబంధిత పనులకు అనుసంధానం చేసి నిధులు మం జూరు చేస్తామన్న హామీని నేడు నెరవేర్చు కున్నారు. తొలి సంతకాన్ని చేసి అన్న మాట నిలబెట్టుకోవడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చింతల పాటి వెంకటకష్ణ, గాదెవారిగూడెం సర్పంచ్ చెన్నా శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేశారు.

నేడు రెవెన్యూ డే

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : ప్రతి ఏడాది జూన్ 20వ తేదీన రెవిన్యూ డేగా జరుపుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్రశేఖర రావు తెలిపారు డిఆర్‌ఓ బుధవారం ఆర్‌డిఒలు తహాశీల్దారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రెవిన్యూ డే నిర్వహణపై తగు సూచనలు చేశారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2024 జూన్ 20న మొదటి రెవెన్యూ డే గా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయిల్లో రెవిన్యూ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆర్డీవోలు తహాశీల్దార్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డే కార్యక్రమంలో రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవల పట్ల, అడంగల్, ఆర్ ఎస్ ఆర్, 1 రెవిన్యూ శాఖ దైనందిన కార్యక్రమాలను వివరిస్తూ రైతులకు, ప్రజలకు తగిన అవగాహన కల్పించాల న్నారు. ఆయా మండలం డివిజన్లో మీసేవ ద్వారా ఎన్ని సర్టిఫికెట్లు ఏయే అంశాల్లో జారీ చేశారు, తదితర సమాచారంతో పాటు, నీటి తీరువ రేట్లు పట్టిక డిస్ప్లే చేయాలని డిఆర్‌ఓ సూచించారు. రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులలో ఉత్తమ సేవలందించిన వారిని సత్కరించాలన్నారు. ఈ కార్యక్రమాలకు తగిన ప్రచారం కల్పించాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించిన ఫోటోలు గ్రూప్ లో అప్లోడ్ చేయాలన్నారు.జిల్లాస్థాయిలో రెవిన్యూ డే జూన్ 20వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు కలెక్టరేట్లో మీటింగ్ హాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొంటారని తెలిపారు.